సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ◆ 16 ◆ జూలై ◆ 2024



సోమశిలలో 9.88 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 9.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 55 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,500
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,766
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,969
నవర (8 గ్రాములు)	రూ.55,752

గరిష్టం/కనిష్టం
31.1 /25.6

వాతావరణం

గాలిలో తేమ 59 శాతంగా సోమవారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా ఆకాశం మంగళవారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి

- సీపీఎం నేత బీవీ రాఘవులు



మాట్లాడుతున్న రాఘవులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీజేపీది ధృతరాష్ట్ర కౌగిలి అని, అలాంటి పార్టీతో టీడీపీ, జనసేన జతకట్టడం సరికాదని సీపీఎం నేత బీవీ రాఘవులు పేర్కొన్నారు. నగరంలోని బాలాజీ నగర్‌లో గల సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. బీజేపీతో జతకట్టిన పార్టీలు దెబ్బతింటాయని, ఇప్పటికైనా వారు మేల్కొనాలని హితవు పలికారు. మహారాష్ట్రలో శివసేన.. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని ఏ విధంగా చీల్చారో అందరికీ తెలిసిందేనన్నారు. ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం, అక్కడి వివాదాలను పరిష్కరించలేదని చెప్పారు. రాష్ట్రంలో ఇరిగేషన్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినిందని, జంఝావతి.. వెలుగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి కాలేదని ఆరోపించారు. రాజధానిగా అమరావతిని మూడేళ్లలో పూర్తి చేస్తామని మంత్రి నారాయణ చెప్పారని.. సింగపూర్, మలేసియా పేర్లెత్తకుండా రాజధాని ఏర్పాటుపై దృష్టి సారించాలని చంద్రబాబుకు హితవు పలికారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నేతలు మోహన్‌రావు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు విద్యార్థుల తరలింపు

నెల్లూరు(అర్బన్): తిరుపతి జిల్లా నాయుడుపేటలోని గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థులు డయేరియాకు గురై వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, వీరిలో సమస్య తీవ్రంగా ఉన్న ఏడుగుర్ని నగరంలోని సర్వజన ఆస్పత్రికి అధికారులు సోమవారం తరలించారు. కాజ్యువాల్టీలో చికిత్స అనంతరం ఇద్దరు చిన్నారులను చిన్నపిల్లల వార్డులో చేర్చారు. మరో ఐదుగుర్ని జనరల్ మెడిసిన్ విభాగంలో అడ్మిట్ చేశారు. కాగా ఆస్పత్రికి వచ్చే సమయానికి విద్యార్థులు తీవ్ర డీహైడ్రేషన్‌కు గురై ఉన్నారు. దీంతో డాక్టర్లు హుటాహుటిన ఫ్లూయిడ్స్ ఎక్కించి తగిన మందులను ఇంజెక్షన్ రూపంలో ఇచ్చారు. విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి తెలిపారు.

ఉర్దూ పాఠశాలల్లో తనిఖీలు




సీతారామపురం: మండలంలోని రంగనాయుడుపల్లి, సీతారామపురం, తురకపాళెం గ్రామాల్లో గల ఉర్దూ పాఠశాలలను ఉర్దూ పాఠశాలల జిల్లా ఉప తనిఖీ అధికారి ఖాజామొహిద్దీన్ ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యా సామర్థ్యాలతో పాటు ఉర్దూ పుస్తకాలను పర్యవేక్షించి, బాగా చదువుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు ఉండేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థులకు కిట్లను అందజేశారు. అనంతరం పడమటిరొంపిదొడ్ల పాఠశాలను ఎంఈఓ మస్తాన్ వలీతో కలిసి సందర్శించారు. పలకలు, నోట్ పుస్తకాలు తదితరాలను పంపిణీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పొదలకూరు: మండలంలోని విరువూరు రీచ్ నుంచి పొదలకూరుకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్ హర్షను అదుపులోకి తీసుకొని ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



వింజమూరు(ఉదయగిరి): ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో మరో బస్సు అదుపుతప్పి రోడ్డు మార్జిన్ వద్ద ఆగడంతో పెనుప్రమాదం తప్పింది. వింజమూరు ఆనకట్ట సమీపంలో సోమవారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సు రోడ్డు దిగకుండా అదుపుచేయడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

భృతి.. గారడీయేనా..?

ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు రూ.మూడు వేలని హామీ



- అధికారంలోకి వచ్చాక మౌనం
- విధివిధానాలు ఖరారుకాక అంతటా అయోమయం
- నిరీక్షిస్తున్న నాలుగు లక్షల మంది
- గతంలో మాదిరిగా మొండిచేయేనా..?

ఉన్నత విద్యను అభ్యసించి.. ఆపై మంచి ఉద్యోగాలు దొరక్క ఎంతో బాధను దాదాపు ఎక్కువ మంది అనుభవించే ఉంటారు. మంచి ఉద్యోగం సాధించాలనే తపన ఉండి.. శిక్షణకు అవసరమైన నగదును ఇంట్లో అడగలేక.. ఆర్థిక పరిస్థితి అనుకూలించక ఎంతో క్షోభను అనుభవిస్తున్నారు. ఈ తరుణంలో నిరుద్యోగ భృతిని అందిస్తే తమ కష్టాలు కొంతవరకైనా తీరుతాయని చాలా మంది భావిస్తుంటారు. దీన్ని అదనుగా చేసుకున్న చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో ఇదే హామీని ఇచ్చి గద్దెనెక్కారు. ఈ అంశంపై నాడు యూటర్న్ తీసుకొని కొందరికే పరిమితం చేసి మోసగించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరిట రూపొందించిన మేనిఫెస్టోలోనూ ఇదే అంశాన్ని పొందుపర్చి పలువుర్ని ఆకర్షించి అధికార పీఠమెక్కారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల గడుస్తున్నా, నిరుద్యోగ భృతికి సంబంధించిన విధివిధానాలను ఇప్పటికీ ఖరారు చేయలేదు. అసలు దీన్ని అమలు చేస్తారా.. లేక మరోసారి రిక్తహస్తం చూపుతారాననే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.మూడు వేల నిరుద్యోగ భృతి ఇస్తా.. ఎంతా.. మూడు వేల రూపాయలు ఇస్తా.. మీ ప్రయోజనాలు కోరే పార్టీ టీడీపీ..' అంటూ ప్రస్తుత సీఎం, నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నిరుద్యోగులకు హామీ ఇచ్చి వారిని ఆకర్షించారు. ఇలా హామీ ఇచ్చి అధికారంలోకి రావడంలో సఫలీకృతులైన ఆయన రోజులు గడుస్తున్నా, ఈ పథకంపై తన వైఖరేంటో తెలియజేయకుండా కప్పదాటు ధోరణిని అవలంబిస్తున్నారు. మరోవైపు నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు వేయి కళ్లతో నిరీక్షిస్తున్నారు. జిల్లాలో దాదాపు 7.2 లక్షల కుటుంబాలకు చెందిన సుమారు నాలుగు లక్షల మంది కొలువులు రాక ఉపాధి కరువై ఆందోళనలో ఉన్నారు.

అందరి ఆశలు భృతిపైనే..

ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరిట మేనిఫెస్టోను టీడీపీ ఆర్భాటంగా రూపొందించింది. ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించి వాటి ద్వారా ప్రజలను ఆకర్షించింది. ఇందులో ప్రధానమైంది నిరుద్యోగ భృతి. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ రూ.మూడు వేలను అందజేస్తామని పేర్కొన్నారు. తాము అనుకున్నట్లే అధికారంలోకి వచ్చినా, ఈ పథకంపై ప్రభుత్వం ఊసెత్తడంలేదు. డిగ్రీ, ఇంజినీరింగ్, ఇంటర్మీడియట్, పదో తరగతి అర్హతతో జిల్లాలో ఎంతో మంది ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారు.

ఫీజులెలా కట్టాలి..

కూటమి ప్రభుత్వం తొలి హామీగా మెగా డీఎస్సీని ప్రకటించింది. దీని ద్వారా జిల్లాలో దాదాపు 650 పోస్టులొచ్చే అవకాశం ఉంది. అలాగే పోలీస్ కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ ఉంటుందని ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ తరుణంలో అవసరమైన శిక్షణ పొందేందుకు ఫీజుల రూపంలో భారీగా కట్టాల్సి ఉంది. కుటుంబానికి ఆర్థిక భారం తప్పదని తెలిసినా, అప్పులు చేసి మరీ శిక్షణ పొందే వారు ఉన్నారు. కోచింగ్‌కు కట్టే ఫీజుతో పాటు ప్రైవేట్ వసతిగృహాల్లో ఉండేందుకు నెలకు దాదాపు రూ.ఆరు వేల వరకు ఖర్చవుతోంది. నిరుద్యోగ భృతి ఇస్తే వీరికి కొంత వెసులుబాటు లభించే అవకాశం ఉంది.

గతంలో మాదిరిగానే పంగనామమా..?

2014లో సైతం నిరుద్యోగ భృతి హామీని చంద్రబాబు ప్రకటించారు. తదనంతరం నాలుగేళ్ల పాటు మౌనం దాల్చారు. చివరికి అనేక కొర్రీలు పెట్టి కొద్ది నెలల పాటు రూ.రెండు వేల భృతిని కొందరికే అందజేసి చేతులు దులుపుకొన్నారు. ఈసారి సైతం తన పాత పంథాను ఆయన ఆచరణలో పెడతారేమోననే సందేహం నిరుద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

అయోమయంలో నిరుద్యోగులు

ఓ వైపు ప్రభుత్వ కొలువు సాధించాలనే పట్టుదల ఉన్నా, ఇంటి వద్దే కొందరు వ్యవసాయం చేసుకుంటున్నారు. మరికొందరు ఆర్థిక వెసులుబాటు లేక చిన్న పనులు చేసకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉన్నత చదువులను అభ్యసించి కొలువులు లభించక కష్టంపైనే ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య కోకొల్లలు. చంద్రబాబు హామీని విశ్వసించి నిరుద్యోగ భృతి ఇస్తారనే ఆశతో కూటమి పార్టీలకు మద్దతు పలికిన ఎంతో మంది ప్రస్తుతం ప్రభుత్వం వ్యవహరిస్తున్న పోకడతో అయోమయంలో ఉన్నారు.

జిల్లాలో ఉన్న కుటుంబాల సంఖ్య: **7.2** లక్షలు (అంచనా)
నిరుద్యోగ యువత: దాదాపు నాలుగు లక్షలు

వైఎస్సార్‌సీపీ హయాంలో లభించిన కొలువులు

అవుట్‌సోర్సింగ్ ద్వారా	: 6150
శాశ్వత ఉద్యోగాలు	: 6,323
వలంటీర్లు	: 12,793
ప్రైవేట్ రంగాల్లో	: 8600కుపైగా

ఎదురుచూస్తున్నాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతిని ఇస్తామని హామీ ఇచ్చారు. దీన్ని నమ్మి ఓట్లేశాం. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడిచినా, దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఉద్యోగాలు భర్తీ చేస్తారని ఎదురుచూస్తుంటే వాటిపైనా ఇదే పరిస్థితి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని మంజూరు చేసి ఆదుకోవాలి.
– సాయికుమార్, ఎంఎ, నిరుద్యోగి, యల్లాయపాళెం, కొడవలూరు

త్వరగా అందజేయాలి



ఎంసీఏను 2014లో పూర్తి చేశా. అప్పటి నుంచి ఉద్యోగం సాధించేందుకు యత్నిస్తున్నా. నిరుద్యోగ భృతి ద్వారా రూ.మూడు వేలను ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నెలవుతోంది. హామీని నెరవేర్చే దిశగా నేటికీ ఎలాంటి చర్యలను ప్రభుత్వం చేపట్టడంలేదు. నా లాంటి ఎందరో నిరుద్యోగ భృతి కోసం నిరీక్షిస్తున్నారు. – మల్లికార్జున, కొత్తపేట, దుత్తలూరు

ప్రతిసారి మోసపోతున్నాం



ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగం లభించక ఉపాధి కోసం ఎదురుచూస్తున్నా. నిరుద్యోగ భృతిని ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆయన మాటలను విశ్వసించి ఓటేసినా నేటికీ హామీ అమలు దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. ఆయన మాటలను నమ్మి ప్రతిసారి మోసపోతున్నాం.
– నగళ్ల అవినాష్, పడుగుపాడు, కోవూరు

భృతిపై స్పష్టత ఇవ్వాలి



నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఉద్యోగాలు కల్పించేంత వరకు నిరుద్యోగ భృతిని అందజేసి అండగా నిలవాలి. చదువుకున్న ఎంతో మంది యువత ఉద్యోగాల్లేక ఇబ్బంది పడుతున్నారు. వీరికి ప్రభుత్వం అండగా నిలవాలి.
– శ్రీనివాసులు, తిక్కవరప్పాడు, వెంకటాచలం మండలం

ప్రచారార్భాటమే



బీటెక్ పాసై సరైన ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నా. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టకపోవడం బాధాకరం. ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని అందజేస్తే మాకు వెసులుబాటు లభిస్తుంది. ఈ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– సందీప్‌రెడ్డి, దీసీపల్లి, మర్రిపాడు మండలం

నిరుద్యోగ భృతి ఇచ్చి తీరాల్సిందే



హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతిని సీఎం చంద్రబాబు ఇచ్చి తీరాలి. 2014లో డిగ్రీ పూర్తి చేశా. అప్పటి నుంచి ఉద్యోగ యత్నాలు చేస్తూనే ఉన్నా. 2014లో నిరుద్యోగ భృతిగా రూ.రెండు వేలను ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి మాట తప్పారు. ప్రస్తుతం రూ.మూడు వేలను ఇస్తామంటున్నారు. గతంలో మాదిరి కాకుండా ఈ భృతిపై స్పష్టత ఇచ్చి తక్షణమే ప్రకటించాలి. యూటర్న్ తీసుకుంటే నిరుద్యోగుల ఉసురు తప్పదు.
– కోటా మాధవరెడ్డి, వేణుగోపాలపురం, జలదంకి

వయస్సు పెరిగిపోతోంది



నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించడం.. రాకపోతే వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.మూడు వేల భృతిని ఇస్తానని ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వోద్యోగాలు వస్తాయని.. కాని పక్షంలో నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నాం. నోటిఫికేషన్లు ఆలస్యమైతే వయోపరిమితి దాటి ప్రభుత్వోద్యోగానికి అర్హత కోల్పోయే ప్రమాదం ఉంది. నోటిఫికేషన్లను తక్షణమే ప్రకటించాలి.
– రాజేష్, నిరుద్యోగి, కావలి

ప్రజలను మోసగించేందుకు ప్రభుత్వ యత్నం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో యూటర్న్ తీసుకుంటూ, మోసగించేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని, ఇలానే వ్యవహరిస్తే ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, హంజా హుస్సేనీ, పేర్నేటి కోటేశ్వరరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పిన చంద్రబాబు నేడు యూటర్న్ తీసుకున్నారని, అయితే ఈ అంశంలో తమ పార్టీ పోరాటానికి దిగడంతో వెనక్కి తగ్గారని చెప్పారు. అమ్మ ఒడి పథకంపై షర్మిల వ్యాఖ్యలు సరికాదన్నారు. ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును గతంలో పోలీస్ కస్టడీకి తీసుకున్న ఘటనలో మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై ప్రభుత్వం 307 కేసు బనాయించడం దారుణమని చెప్పారు. పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న రఘురామకృష్ణంరాజును గతంలో పోలీసులు అరెస్ట్ చేశారని, అయితే జగన్‌పై కేసు పెట్టడం రాజకీయ కక్షేనని తెలిపారు. పోలీస్‌స్టేషన్లో జరిగిన ఘటనకు సంబంధించి నేరుగా నాటి ముఖ్యమంత్రిపై 307 కేసు పెట్టడం దేశంలో ఎక్కడా జరగలేదని గుర్తుచేశారు. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన జీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తీసుకొస్తామని టీడీపీ కూటమి హామీ ఇచ్చిందని, అయితే ప్రస్తుతం జీపీఎస్‌నే అమలు చేసేలా జీఓను జారీ చేయడం మోసపూరిత చర్యగా అభివర్ణించారు. ఇసుక ఉచితమని చెప్పి, ప్రస్తుతం ట్రాక్టర్‌కు రూ.3500 వసూలు చేస్తూ పూర్తిగా నింపకుండా ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.

రొట్టెల పండగకు ఏర్పాట్లు పూర్తి

- మంత్రి నారాయణ

నెల్లూరు(దర్గామిట్ట): రొట్టెల పండగకు సంబంధించిన ఏర్పాట్లను దాదాపు 95 శాతం మేర పూర్తి చేశామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. పండగ నిర్వహణపై నగరంలోని కలెక్టరేట్లో కలెక్టర్ ఆనంద్‌తో పాటు అన్ని శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. రొట్టెల పండగ బుధవారం ప్రారంభం కానుందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. వారం రోజుల పాటు జరగనున్న పండగను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశామని, దాదాపు 20 లక్షల మందికిపైగా భక్తులు బారాషహీద్ దర్గా సందర్శనకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అప్పటి మేయర్ అబ్దుల్ అజీజ్ చొరవతో బారాషహీద్ దర్గాను ఎంతో అభివృద్ధి చేశామని వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు పండగ నిర్వహణపై అధికారులతో నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య శిబిరాలు, విద్యుత్, అగ్నిమాపక అధికారుల పర్యవేక్షణ తదితరాలపై చర్చించామన్నారు. ఏఎస్పీలు సౌజన్య, గాదె శ్రీనివాసరావు, శ్రీనివాసులు, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శర్మద, సిటీ ప్లానర్ దేవీకుమారి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, నగరపాలక సంస్థ ఎస్ఈ సంపత్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, మత్స్యశాఖ ఎస్ఈ నాగేశ్వరరావు, డీపీఓ సుస్మిత, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

అమాత్య.. ఇదేమిటయ్యా..?



మంత్రి, కలెక్టర్‌తో కలిసి సమీక్షలో పాల్గొన్న టీడీపీ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): నవ్విపోదురు గాక నాకేటి అనే రీతిన తయారైంది జిల్లాలో అధికార పార్టీ పరిస్థితి. ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే సమీక్ష సమావేశాల్లో టీడీపీ నేతలు యథేచ్ఛగా పాల్గొని అధికారులకు ఆదేశాలిచ్చే స్థాయికి ఎదిగారు. తాజాగా ఈ ఉదంతానికి నెల్లూరు కలెక్టర్ కార్యాలయం వేదికైంది. రొట్టెల పండగకు సంబంధించిన సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ ఆనంద్, అధికార యంత్రాంగంతో మంత్రి నారాయణ నిర్వహించారు. అసలు ఎలాంటి హోదా లేని టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఆ పార్టీ నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సదరు కార్యక్రమంలో పాల్గొని అధికారులకు ఆదేశాలిచ్చారు. సదరు నేతలను తన పక్కన మంత్రి కూర్చోబెట్టి సమీక్ష నిర్వహించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- ఎస్పీ కృష్ణకాంత్
- జిల్లా పోలీస్ బాస్‌గా బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణలో రాజీపడేదిలేదని, నేరస్తులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ జిల్లా ఎస్పీగా కృష్ణకాంత్ నగరంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 1.05 గంటలకు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసి వీటిపై దాడులను ముమ్మరం చేస్తామని తెలిపారు. మహిళలు, యువత, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తామని ప్రకటించారు. ప్రత్యేక ప్రణాళికతో నేరాలను కట్టడి చేస్తామని.. రౌడీషీటర్లు, అసాంఘిక, సంఘ విద్రోహశక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంతో పాటు పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసి వారి ఆకాంక్షలకు అనుగుణంగా విధులను నిర్వర్తిస్తామని చెప్పారు. నిరంతరం అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావొచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని వర్గాల సహకారం ఎంతో అవసరమన్నారు. ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు.

చేపల గుంతలో వృద్ధుడి మృతదేహం


వెంకట సుబ్బయ్య (ఫైల్)

సంగం: మండలంలోని దువ్వూరు వద్ద సోమవారం చేపల గుంతలో ఓ వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. సంగంలో మాఘం వెంకటసుబ్బయ్య (65) నివాసం ఉంటున్నారు. ఈయన చేనేత కార్మికుడు. భార్య, కుమార్తె ఉన్నారు. సంవత్సర కాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటసుబ్బయ్య తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆందోళన చెంది గాలించారు. సోమవారం దువ్వూరు వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారి పక్కనున్న చేపల గుంతలో వెంకటసుబ్బయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. బుచ్చిరెడ్డిపాళెంలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటా

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: 'అధికార పార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదు. పార్టీ కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వను. వారికి అండగా ఉంటా' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో రిషి కల్యాణ మండపంలో సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ప్రజలకిచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి రాష్ట్ర చరిత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. జగన్ పాలనలో విధ్వంసం జరిగిందని ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు ప్రచారం చేయడం విచారకరమన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల ముంగిటకే పాలన అందించడం విధ్వంసమా?, పేదవాడికి సంక్షేమ కార్యక్రమాలను అందించడం విధ్వంసమా? అని విజ్ఞత కలిగిన వారు ఆలోచించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే టీడీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం, అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను పగులగొట్టడం, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆస్తులపై దాడి చేయడం విధ్వంసం కాదా ప్రశ్నించారు.

పాలన గాలికి..

ప్రజలు అధికారం ఇస్తే చంద్రబాబునాయుడు పాలనను గాడికొదిలి వైఎస్ జగన్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలకు దిగడం దౌర్భాగ్యమని కాకాణి అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలు చేస్తున్న అధికార పార్టీ నాయకులను విడిచిపెట్టేది లేదన్నారు. 2019 – 2024 మధ్య సర్వేపల్లి నియోజకవర్గంలో తన శక్తి మేర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మంచి జరిగేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు, పోలీస్ యంత్రాంగం కార్యకర్తలు, నాయకుల వరకు రావాలంటే తనను దాటి వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు ఇసనాక రమేష్‌రెడ్డి, కావల్‌రెడ్డి రంగారెడ్డి, గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, టంగుటూరు పద్మనాభరెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తలమంచి సురేంద్రబాబు, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, దువ్వూరు గంగాధర్‌రెడ్డి, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, మన్నెం చిరంజీవుల గౌడ్, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, కోటా శేఖర్‌రెడ్డి, నెల్లిపూడి సునీల్‌రెడ్డి, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు


హాజరైన నాయకులు, కార్యకర్తలు

15 సవర్ల బంగారం, నగదు చోరీ


కింద పడేసిన దుస్తులు

అల్లూరు: మండల కేంద్రమైన అల్లూరులో మరో దొంగతనం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అల్లూరుపేటకు చెందిన వల్లపోలు శ్రీనివాసులురెడ్డి కుటుంబం ఈనెల 11వ తేదీ రాత్రి తిరుమలకు వెళ్లింది. సోమవారం తిరిగొచ్చే సరికి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. కుటుంబసభ్యులు గది తాళాలు ఇంట్లోనే పెట్టారు. దీంతో దొంగలు వాటి ద్వారా గదిని తెరిచారు. బీరువా తాళాలు కూడా అక్కడే ఉండడం వారికి కలిసొచ్చింది. బీరువాను తెరిచి 15 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.75 లక్షల నగదును అపహరించారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి ఘటనా స్థలాన్ని చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంటల వ్యవధిలోనే మరో దొంగతనం జరగడం పోలీసులకు సవాల్‌గా మారింది.

సమస్యలు పరిష్కరించాలంటూ..

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీల వెల్లువ

నెల్లూరు(దర్గామిట్ట): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున నెల్లూరులోని కలెక్టరేట్‌కు విచ్చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం తిక్కన ప్రాంగణంలో జరిగింది. ఇందులో కలెక్టర్ ఒ.ఆనంద్ వినతిపత్రాలు స్వీకరించారు. ఎన్డీఏ హయాంలో ముస్లింలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. నగరంలో టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలంటూ అఖిలపక్ష నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియా ఉల్‌హక్, సీపీఐ నెల్లూరు నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, రాష్ట్ర మైనార్టీ జేఏసీ నాయకులు షేక్ ఆసీఫ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

- సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, బీసీ విద్యార్థి యువజన రాష్ట్ర కన్వీనర్ యు.మురళీకృష్ణ యాదవ్ అర్జీని సమర్పించారు.
- టిప్పు సుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయొద్దని భారతీయ జనతా యువమోర్చా నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 217 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ కలెక్టర్ సేదు మాధవన్, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి, జిల్లా పరిషత్ సీఈఓ కన్నమనాయుడు, డీఈఓ రామారావు, సీపీఓ ఎస్.రాజు, డీపీఓ సుస్మిత, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సాంబశివారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డ్వామా పీడీ శ్రీనివాసులు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటరమణ, జిల్లా మేనేజర్ లక్ష్మి నరసింహారావు, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న కలెక్టర్ ఆనంద్

105 వినతులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. దీనికి 105 మంది విచ్చేసి తమ సమస్యలను ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌ల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఆస్తి వివాదాలు, ఉద్యోగాల పేరిట మోసాలు, సైబర్ నేరాలు, అత్తింటి వేధింపులు, మిస్సింగ్‌లు తదితరాలపై వినతులు అందజేశారు. సమస్యలను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఏఎస్పీలు పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


బాధితుడి వినతిని పరిశీలిస్తున్న ఏఎస్పీ ప్రసాద్

రొట్టెల పండగకు ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ ఆర్ఎం విజయరత్నం

నెల్లూరు సిటీ: 'రొట్టెల పండగకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తారు. వారి కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నాం' అని ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్ఎం విజయరత్నం తెలిపారు. సోమవారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల నుంచి బారాషహీద్ దర్గా, కసుమూరు, ఏఎస్‌పేట ప్రాంతాలకు బస్సు సర్వీసులను అందుబాటులో ఉంచామన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే పోలీసు శాఖ, కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి రూట్‌మ్యాప్‌ను తీసుకోవడం జరిగిందన్నారు. క్షేమంగా, త్వరితగతిన గమ్యస్థానాలకు చేర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక బస్సు సర్వీసులకు సాధారణ టికెట్ ధరే ఉంటుందన్నారు. నెల్లూరు నుంచి కసుమూరుకు రోజూ 18 బస్సు సర్వీసులు ఉంటాయన్నారు. ధర రూ.30గా నిర్ణయించామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆత్మకూరు బస్టాండ్, బుచ్చిరెడ్డిపాళెం, హసనాపురం మీదుగా ఏఎస్‌పేట వరకు 16 బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. టికెట్ ధర రూ.70 అని తెలియజేశారు. ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంకు వరకు ఆరు బస్సు సర్వీసులు తిరుగుతాయన్నారు. టికెట్ ధర రూ.10 అని చెప్పారు. వెంకటాచలసత్రం నుంచి కసుమూరుకు రెండు సర్వీసులుంటాయని, టికెట్ ధర రూ.20గా నిర్ణయించామన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఎం

187 మంది విద్యుత్ అధికారులు, సిబ్బంది నియామకం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రొట్టెల పండగ కోసం 187 మంది విద్యుత్ అధికారులు, సిబ్బందిని నియమించినట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. దర్గాలో జరుగుతున్న విద్యుత్ సంబంధిత పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సరఫరా కోసం నాలుగు 315 కేవీఏ, ఒక 250 కేవీఏ, ఐదు 160 ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టామన్నారు. 125 కేవీఏ జనరేటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పండగ జరిగే ఐదురోజులపాటు విద్యుత్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారన్నారు. ఒక్కో షిఫ్టులో డీఈఈ, ఏఈతోపాటు నలుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. అదే విధంగా సాయంత్రం విద్యుత్ అధికంగా వినియోగించే (పీక్ లోడ్) సమయాల్లో అదనంగా ఒక డీఈఈ, ఇద్దరు ఏఈలు, ఎనిమిది మంది సిబ్బందిని నియమించామన్నారు. మొత్తం 15 మంది డీఈఈలు, 22 మంది ఏఈఈలు, 150 సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. ఐఈ విద్యుత్ సెక్షన్‌కు చెందిన సిబ్బంది పూర్తిగా దర్గా ప్రాంగణంలోనే ఉండేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్ఈ వెంట ఈఈ శ్రీధర్, ఏఈలు లక్ష్మీనారాయణ, అనిల్, ఎల్ఐలు మధు, నారాయణ ఉన్నారు.


బారాషహీద్ దర్గా వద్ద అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

చెల్లని చెక్కు కేసు..

- విద్యుత్ ఉద్యోగికి ఏడాది జైలు

నెల్లూరు(లీగల్): అప్పు తీసుకుని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చారనే కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో నెల్లూరు ఏకే నగర్ ఏపీఎస్పీడీసీఎల్ టీఆర్ఈ సెక్షన్ సెకండ్ గ్రేడ్ ఉద్యోగి పత్తిపాటి కృష్ణకు శిక్ష ఖరారైంది. ఏడాది జైలు శిక్షతోపాటు ఫిర్యాదికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని నెల్లూరు స్పెషల్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సుయోధన్ సోమవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కృష్ణ తన అవసరాల నిమిత్తం నెల్లూరు కోటమిట్ట ప్రాంతానికి చెందిన బళ్లారి సుధీర్‌కుమార్ అనే వ్యక్తి నుంచి 2015 సంవత్సరం అక్టోబర్ 23వ తేదీన రూ.5,00,000లు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. తిరిగి చెల్లించే క్రమంలో 2018 సంవత్సరం ఏప్రిల్ 25వ తేదీన రూ.7,50,000లు నెల్లూరు ఆంధ్రా బ్యాంకు, ఏకే నగర్ బ్రాంచ్ పేరుపై చెక్కును కృష్ణ ఇచ్చాడు. సుధీర్‌కుమార్ ఆ చెక్కును అదే ఏడాది మే 30వ తేదీన వేదాయపాళెంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో వేయగా నగదు లేని కారణంగా చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో సుధీర్ కుమార్ తన లాయర్ ద్వారా లీగల్ నోటీసు పంపారు. కోర్టులో కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.55
సన్నవి	రూ.38
పండ్లు	రూ.28

'ఏరియా ఆస్పత్రి డాక్టర్లు పట్టించుకోలేదు'

- కాన్పు కోసం కందుకూరు ఏరియా ఆస్పత్రికి వచ్చిన మహిళ
- వైద్యం విషయంలో డాక్టర్లు నిర్లక్ష్యం చేశారంటూ భర్త ఆందోళన
- అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కందుకూరు: 'కాన్పు కోసం నా భార్యను ఆస్పత్రికి తీసుకొస్తే డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారు' అంటూ ఓ వ్యక్తి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఎదుట సోమవారం ఆందోళన చేశాడు. వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలంలోని గోగినేనిపాళేనికి చెందిన ఎండ్లూరి ఎలిజిబెత్ అనే మహిళను కాన్పు కోసం కుటుంబసభ్యులు మూడు రోజుల క్రితం ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చారు. ఆమెను గైనిక్ విభాగంలో చేర్చారు. సోమవారం ఒక్కసారిగా ఎలిజిబెత్‌కు నొప్పులు రావడంతో డాక్టర్లు కాన్పు చేసేందుకు ప్రయత్నించారు. అకస్మాత్తుగా ఉమ్మనీరు పోయి, బిడ్డ చేయి కొంత బయటకు వచ్చింది. దీంతో కాన్పు చేయడం కష్టమవుతుందని భావించిన డాక్టర్లు ఒంగోలు రిమ్స్‌కు రెఫర్ చేశారు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఆమెను తరలించారు. సదరు మహిళ భర్త రాజేష్ తన భార్యకు కాన్పు చేసే విషయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, మూడు రోజుల నుంచి పట్టించుకోకుండా అత్యవసర పరిస్థితి వచ్చే వరకు తనకేమీ చెప్పలేదని సోమవారం ఆందోళనకు దిగాడు. హాస్పిటల్ గేట్లను మూసివేసి గందరగోళం సృష్టించాడు. దీంతో డాక్టర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని రాజేష్‌కు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన విరమించేందుకు ససేమిరా అన్నాడు. దీంతో అదుపులోకి తీసుకున్న పోలీసులు రాజేష్‌ను స్టేషన్‌కు తరలించారు.


రాజేష్‌తో మాట్లాడుతున్న పోలీసులు

అందుకే పంపాం

ఈ ఘటనపై హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి స్పందించారు. ఎలిజిబెత్‌కు ఇప్పటికే ముగ్గురు పిల్లలున్నారని, నాలుగో కాన్పు కావడంతో ప్రసవ నొప్పులు వస్తున్నాయా? లేదా? అని గుర్తించడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. దీంతో మూడు రోజుల నుంచి ఆమెను డాక్టర్లు పర్యవేక్షిస్తున్నారని, సోమవారం నొప్పులు వస్తున్నాయని చెప్పడంతో సాధారణ కాన్పు కోసం ప్రయత్నం చేశారని చెప్పారు. అయితే నాలుగో కాన్పు కావడంతో గర్భసంచి జారి ఉండే అవకాశం ఉందని, దీని వల్ల అకస్మాత్తుగా ఉమ్మనీరు బయటకు పోయిందన్నారు. బిడ్డ చేయి కొద్దిగా బయటకు రావడంతో కడుపులో అడ్డం తిరిగినట్లు గుర్తించామన్నారు. ఆ సమయంలో ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీయడం కొంత ఇబ్బందికరమైన విషయమని, దీంతో అన్ని సౌకర్యాలతోపాటు ఇద్దరు, ముగ్గురు డాక్టర్లుండే ఒంగోలు రిమ్స్‌కు రెఫర్ చేయాల్సి వచ్చిందని సమాధానమిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

తోటపల్లిగూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చింతోపులో జరిగింది. సోమవారం ఎస్సై జంపాని కుమార్ వివరాలు వెల్లడించారు. చింతోపు గ్రామానికి చెందిన పందేటి సునీల్ (23), ఇందుకూరుపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన కల్యాణ స్నేహితులు. వీరు ఆదివారం సాయంత్రం నరుకూరు సెంటర్‌లో పని చూసుకుని మోటార్‌బైక్‌పై చింతోపునకు బయలుదేరారు. అదే సమయంలో పేడూరు గ్రామానికి చెందిన కల్లూరు అశోక్ అనే యువకుడు నరుకూరు నుంచి చింతోపునకు బైక్‌పై వస్తున్నాడు. అంజనేయపురం సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సునీల్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	126
లేయర్ (లైవ్)	110
బ్రాయిలర్ చికెన్	226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	254
లేయర్ చికెన్	187